# బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ ఖాయం



బీఆర్ఎస్‌లో చేరిన మద్దిమడుగు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో విప్ గువ్వల బాలరాజు

- అభివృద్ధి, సంక్షేమ పథకాలే విజయతీరాలకు చేరుస్తాయి
- అరవైఏండ్లలో కాంగ్రెస్ చేయలేని ప్రగతి తొమ్మిదేండ్లలో చేశాం
- ఎవరెన్ని కుట్రలు చేసినా గెలుపు మనదే..
- ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- అచ్చంపేటలో కార్యకర్తల సమావేశం
- బీఆర్ఎస్‌లో చేరిన మద్దిమడుగు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

అచ్చంపేటరూరల్, అక్టోబర్ 13 : తెలంగాణలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం అని ప్రభుత్వ విప్, గువ్వల బాలరాజు అన్నారు. గత రెండు పర్యాయాలు ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను విజయాల తీరాలకు చేరుస్తాయని ప్రకటించారు. శుక్రవారం అచ్చంపేటలో మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అరవై ఏండ్ల పాలనలో చేయని అభివృద్ధి సంక్షేమ ఫలాలు తెలంగాణ ప్రజలకు తొమ్మిదిన్నర ఏండ్లలో చేసి చూపించామన్నారు. ప్రజల కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని, పనిచేసే వారినే ఆదరించాలని ప్రతి ఇంటికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు చేరాయని గ్రామాల్లో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని పోల్చుతూ గత కాంగ్రెస్ పథకాలలో జరిగిన అవినితిని బట్టబయలు చేయాలని, ఇందిరమ్మ పథకం మొదలు కొని ప్రతి పథకంలో డబ్బులను గ్రామాల్లో పంచుకున్న ఘనత మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణదని మండిపడ్డారు. ఆపదలో తన దవాఖానకు వెళ్లిన నిరుపేద ప్రజలను మభ్యపెట్టి అడ్డగోలుగా డబ్బులను ఫీజుల రూపంలో వసూలు చేశారని విమర్శించారు. ఈ ప్రాంత వాసిని డాక్టర్‌ను అని చెప్పుకోవడమే తప్పా ఆచరణ శూన్యమని, హైదరాబాద్‌లో మకాం పెట్టి ఆదునాతన దవాఖాన కల్వకుర్తిలో ఏర్పాటు చేసుకొని జనాలను జలగల్లా పీడిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నామని ఫోజులు గొడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో మళ్లీ రాబోయేది మన బీఆర్ఎస్ ప్రభుత్వామేనని దానికి రథ సారధులు మీరేనని కార్యకర్తలకు సూచించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా, సహాయం పొంది పార్టీని దగా చేసి పక్కకు వెళ్లినా భయపడేది లేదని ప్రజల ఆమోదంతో మనమే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు పోకల మనోహర్, మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహా గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ బలుస అరుణ, ఎంపీపీ శాంతాలోక్యానాయక్, బీఆర్ఎస్ మండల అధ్య క్షుడు పర్వతాలు, పీఏసీసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డితోపాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్దిమడుగులో కాంగ్రెస్ ఖాళీ

అచ్చంపేట, అక్టోబర్ 13 : పదర మండలంలోని మద్దిమడుగుకు చెందిన 100మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ వ్యవహార శైలి నచ్చక కాంగ్రెస్‌ను వీడారు. శుక్రవారం అచ్చంపేటలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎడమోని వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి, అంజి ఆధ్వర్యంలో వంద మంది కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే గువ్వల వీరికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చంపేటతోపాటు తెలంగాణలో మళ్లీ ఎగిరేది గులాబీ జెండేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు మా పార్టీ కార్యకర్తలను భయబ్రాంతులకు గురిచేయడం శ్రేయస్కరం కాదని, పార్టీ మారాలని కొంతమందిని బలవంత పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాంబాబు నాయక్, డాక్టర్ విష్ణుమూర్తి, శంకర్ మాదిగ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్

# గిరిజన క్రీడోత్సవాలు ప్రారంభం

- మూడు రోజుల పాటు కొనసాగనున్న ఆటలు
- పోటీలను ప్రారంభించిన అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్
- హాజరైన గిరిజన విద్యాసంస్థల ఆర్‌సీవో నాగార్జున
- హాజరైన 13 గిరిజన విద్యాసంస్థల విద్యార్థినులు

కల్వకుర్తి, అక్టోబర్ 13 : తెలంగాణలోని జోన్ 4 పరిధిలో గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాలల క్రీడాత్సవాలు శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల/ కళాశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న క్రీడలకు జోన్ 4 పరిధిలో 13 గిరిజన బాలికల పాఠశాల/కళాశాలలకు చెందిన విద్యార్థినులు 620 మంది హాజరయ్యారు. అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ గిరిజన విద్యాసంస్థల ఆర్‌సీవో నాగార్జునతో కలిసి జ్యోతి ప్రజ్వలన, క్రీడా జెండాలను ఎగురవేసి క్రీడోత్సవాలను ప్రారంభించారు. అండర్ 14, అండర్ 17, అండర్ 19 విభాగాలుగా ఈనెల 15వరకు క్రీడలను నిర్వహించనున్నారు. క్రీడోత్సవాల నిర్వహణకు గానూ, క్రీడలలో పాల్గొంటున్న విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు చేసినట్లు అధ్యాపకులు తెలిపారు.

### చదువుతోపాటు క్రీడలు ముఖ్యం

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమని అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురుకుల గిరిజన బాలికల పాఠశాల/ కళాశాలలో క్రీడోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కష్టపడకుండా ఫలితంగా సాధించడం సాధ్యం కాదని, అది ఆటల్లోనైనా, చదువుతోనైనా అని పేర్కొన్నారు. ఇక్కడ చదువుకుంటున్నది అందరు పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులేనని, మీకు అందరికీ కష్టం విలువ తెలుసునని, చక్కగా చదువుకొని వృద్ధిలోకి రావాలని విద్యార్థినులను సూచించారు. గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులెందరో చదువుతోపాటు, క్రీడల్లో ఎంతో ఉత్తమంగా రాణిస్తున్న ఉదంతాలను ఆయన గుర్తు చేశారు. చదువులో, క్రీడ ల్లో ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గురుకులాలు, తల్లిదండ్రుల పేరును నిలబెట్టాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు అదనపు కలెక్టర్‌కు విద్యార్థినులు బ్యాండ్‌తోపాటు గిరిజన సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. అదేవిధంగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సుజాతరావుతోపాటు, వివిధ గురుకుల గిరిజన పాఠశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న జహీరాబాద్-తాండూర్ పాఠశాల విద్యార్థినులు

# అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణే నెంబర్ వన్

- సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే..
- అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులను నిలదీయండి
- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో కాంగ్రెస్, టీడీపీ నాయకులు



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కోడేరు, అక్టోబర్ 13 : దేశంలో అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణే నెంబర్ వన్ అని, రాష్ట్రంలో ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని ఎల్లూరి చెంచుగూడెం, కోడేరు మండలం నాగులపల్లి, రాజాపూర్ గ్రామాల నుంచి మాజీ మంత్రి జూపల్లి వర్గీయులు, టీడీపీ నాయకులు దాదాపు 140 మంది ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఆయన గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ రైతుల కోసం రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్‌తోపాటు రుణమాఫీ లాంటి పథకాలు అమలు చేశారన్నారు. అదేవిధంగా పేదల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు, గృహలక్ష్మి, దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు లాంటి పథకాలను అమలు చేసి అన్ని వర్గాలను ఆదుకుంటున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ 56 ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు లేని గ్యారెంటి ఇప్పుడు ఆరు గ్యారెంటి పథకాలు అని ప్రజలు మోసం చేయటానికి వస్తున్నారన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకలో కేవలం రూ.1100 పింఛన్ మాత్రమే ఇస్తున్నారని, వీరు తెలంగాణలో రూ.5 వేలు ఎలా ఇస్తారు అని, అదేవిధంగా అభివృద్ధిని అడ్డుకుంటున్న బీజేపీ నాయకులు రాష్ట్రానికి ఏం చేశారో నిలదీయాలని ప్రజలకు సూచించారు. కొల్లాపూర్‌లో ఓ నాయకుడికి 5సార్లు ఓట్లు వేసి గెలిపిస్తే తిరిగి ఓట్లు వచ్చినప్పుడు మాత్రమే కనిపించాడని, ఆ పెద్దమనిషికి 70 ఏండ్ల వయస్సు వచ్చినా ఇంకా అధికారం మీద యావ చావలేదని అధికారం కోసం పార్టీ మారి మళ్లీ మీ దగ్గరికి వస్తున్నాడని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదీ ఏమైనా ప్రజలంతా అభివృద్ధి చేసే బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచి సీఎం కేసీఆర్‌ను మూడో సారి ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, విండో చైర్మన్లు చిన్నారెడ్డి, కృష్ణారెడ్డి, డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డితోపాటు ఆయా గ్రామాల నేతలు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ నూతన ఎస్పీగా గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 13: నాగర్‌కర్నూల్ నూతన ఎస్పీగా గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ నియమితులయ్యారు. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఇక్కడ ఎస్పీగా పనిచేసిన మనోహర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో పెద్దపల్లి జిల్లాలో డిప్యూటీ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్న వైభవ్ రఘునాథ్ బదిలీపై నాగర్‌కర్నూల్‌కు వచ్చారు. శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు.

# సీఎం సభా స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ

జడ్చర్ల, అక్టోబర్ 13 : జడ్చర్లలో ఈనెల 18న నిర్వహించనున్న సీఎం బహిరంగ స్థలాన్ని, హెలీప్యాడ్ స్థలాన్ని శుక్రవారం ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ సత్యన్న, జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ రాములు పరిశీలించారు. సభకు వచ్చే జనాలు ఎక్కడి నుంచి రావాలనే అంశాలపై సిబ్బందితో మాట్లాడారు. సెక్యూరిటీపరంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అనంతరం బహిరంగ సభ, హెలీప్యాడ్ తదితరాలను సీఎం సెక్యూరిటీ విభాగం ఏఎస్పీ మహేశ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసులులు పరిశీలించారు. కార్యక్రమంలో జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు, ఇంటలీజెన్స్ సీఐ నరేందర్, ఎస్సై అభిషేక్, సురేశ్ ఉన్నారు.



బహిరంగసభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీ సత్యన్న